

# కారుమేఘాలు

శ్రావణ మేఘాలు హడావిడిగా పేరంటానికి వెళ్తున్నాయి. క్రొత్త చీరలు, ముంజేతికి తోరణాలు, పసుపు పూసిన పాదాలు, నుదుట పెద్ద కుంకుమబొట్టు, చేతులలో పచ్చి శనగల పొట్లాలు, సన్నటి తుంపర చల్లగా స్పృశిస్తూంటే తనువులు పులకరించి హృదయాలు అనుభూతి అంచుల్ని తాకుతూ ఉండగా కబుర్ల మువ్వలు మ్రోగించు కుంటూ అడుగుముందుకు కదుపుతున్నారు పేరంటాళ్ళు.

వసుధ ఎలుగెత్తి ఏడుస్తున్న కొడుకుని సముదాయించడానికి నానా తంటాలు పడుతూంది. ప్రక్కవాటాలోని పేరంటాళ్ళ కోలాహలాన్ని నిర్లిప్తంగా గమనిస్తూందామె. ప్రక్కవాటా సుందరి వారం రోజుల నుంచి వరలక్ష్మి వ్రతానికి సన్నాహాలు చేస్తూంది. అవతలివాటా మణిని తోడుతీసుకెళ్ళి కంచిపట్టుచీర కొనుక్కుని వచ్చింది. రెండు మూడు రోజుల్నించి తెలిసిన ముత్తయిదువులందర్నీ బొట్టుపెట్టి పేరంటానికి పిలిచి వచ్చింది. ఉదయం వ్రతం చేసుకుని వసుధను, మణిని భోజనానికి పిలిచింది. సుందరి పెట్టిన భోజనం రెండుముద్దలు తినగానే ఆకలితో నకనకలాడుతున్న జాన్ గుర్తుకొచ్చి కడుపంతా తెమిలినట్లయి చెయ్యి కడిగేసుకుంది వసుధ. నాలుగు రోజులుగా అర్ధాకలితో నెట్టుకొస్తున్న వసుధకు, జాన్‌కి నిన్నటి నుంచి అదీలేక "కడుపునిండా భోజనం" అనేది ఒక తియ్యటి అనుభవంగా అనిపించసాగింది.

పసిబిడ్డ ఆకలితో ఎండిన రొమ్ముల్ని పీకుతూ ఉంటే ప్రాణం జివ్వుమంది వసుధకు. అప్పుకోసం వెళ్ళిన జాన్ ఎంతోకొంత డబ్బు తెస్తాడు, ఒక గ్లాసుడు పాలైనా కొని బిడ్డకు పట్టొచ్చని ఆశగా ఎదురు చూసిన వసుధ వట్టి చేతుల్తో తిరిగొచ్చిన భర్తను చూసి ఏడుపు నాపుకోలేకపోయింది.

"వసూ! ప్లీజ్, ఏడవొద్దు నువ్వు. నీ ఏడుపు చూస్తుంటే నాకు ఉన్న ధైర్యం కూడా కరిగిపోయి పాతాళంలోకి క్రుంగిపోతున్నట్లుగా వుంది." వంగి భార్య తలమీద చెయ్యేసి ఓదార్పుగా తడుతున్న జాన్ శక్తి సన్నగిల్లి నిస్సత్తువతో ఒరిగిపోతున్న సైనికుడిలా వున్నాడు.

"మన మెలాగైనా వుంటాం. బాబునేం చెయ్యను చెప్పు?" దీనంగా అడిగింది వసుధ. ఆమె కళ్ళముందు ఎమ్.ఏ. ఫస్ట్ క్లాస్ డిగ్రీలు తీసుకుని 'ఈ విశాల విశ్వం తమకోసమే సృష్టించబడింది. దీనికి అధినేతలు తామే' నన్నంత ధీమాతో యూనివర్శిటీ బయటకు అడుగుపెట్టిన రోజు కదిలింది. తరువాత ఉద్యోగం సంపాదించడానికి పడినపాట్లు, అవమానాలు, ఆశాభంగాలు గుర్తుకొచ్చాయి. జాన్‌కి ఈ ఊళ్ళో ఉన్న ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్ పోస్ట్ దొరికిన రోజున యెంతగా పొంగిపోయారు! "మనసులు కలిసిన స్త్రీ పురుషులు కలిసి బ్రతకడానికి, హాయిగా, సుఖంగా జీవించడానికి అంతులేని ఐశ్వర్యం వుండనఖ్ఖర్లేదు, కనీస అవసరాలు తీరితే చాలు. అనురాగం, ఆప్యాయత దంపతుల్ని కట్టి వుంచాలి కాని కులం, మతం, ఆస్థి, అంతస్తు కాదు" అంటూ తన వారందర్నీ ధిక్కరించి జాన్‌తో తన బ్రతుకుని ముడేసుకుని ఈ ఊరికి తరలివచ్చిన రోజు జ్ఞాపకం వచ్చింది.

కాపురం పెట్టిన కొద్ది నెలలకే ఎదురయిన అనుభవాలు చూసి తబ్బిబ్బు పడిపోయారు భార్యాభర్తలిద్దరూ. సంతకం చేయించుకునే అంకెవేరు, చేతికందే జీతం వేరు. ఆ అందేదికూడా నెలల తరబడి చేతికందకపోవడంతో ఎలా బ్రతకాలో తెలియక బెంబేలు పడిపోసాగారు. అప్పు

చెయ్యడమనే ఆర్ట్ బొత్తిగా తెలియకపోవడంవల్ల, తమ పరిస్థితుల్ని యితరులకు తెలియనివ్వడం నామోషీగా భావించడం వల్ల పస్తులుండడమనే ఆర్ట్‌ని ప్రాక్టీస్ చెయ్యక తప్పింది కాదు.

చేసిన ఉద్యోగ ప్రయత్నాలు ఫలించక విసిగి వూరుకున్న వసుధ ఈ విషమ పరిస్థితిలో ఎంతో కొంత తనుకూడా సంపాదిస్తే తప్పబ్రతుకు గడవదని తెలిసొచ్చి మళ్ళీ ఉద్యోగపు వేటలో పడింది. ఒక కాన్వెంట్ స్కూల్లో టీచర్‌గా టెంపరరీ పోస్టు ఒకటి ఖాళీగా ఉందని తెలిసి అప్లయ్ చేసింది. అయితే ఆ జాబ్ ఎలా పొందాలో వివరాలు తెలుసుకొచ్చిన మిత్రుడు చెప్పేసరికి నిర్ఘాంతపోయారు. ఆ జాబ్ వెల కేవలం ఇరవైవేల రూపాయలేనని, సకాలంలో మేల్కొని ఆ ధర చెల్లించకపోతే యింకో వెయ్యి ఎక్కువగా కట్టిఅయినా సరే జాబ్ సంపాదించడానికి లెక్కలేనంతమంది కాచుక్కూర్చు న్నారని చెప్పి అప్పోసప్పో చేసయినా సరే జాబ్ దక్కించుకోమని ఉద్భోధించాడా మిత్రుడు. "లంచమిచ్చి జాబ్ సంపాదించడమా? ఇంత ఆత్మన్యూనతతో కూడిన వ్యవహారానికెలా పాల్పడడం!'' అని గుంజాటన పడ్డారు. పస్తులతో పడుకొనైనా పడుకుంటాంగాని ఇంత సిగ్గుచేటైన పనికి తలపడలేమన్నారు. వారి అమాయకత్వానికి జాలిపడ్డ మిత్రుడు, ప్రస్తుత వ్యవస్థలో ప్రతి చిన్నదీ ఎలా అమ్మకపు వస్తువుగా మారిందో, మనకు కావలసినదాన్ని తల తాకట్టు పెట్టయినా సరే ఎలా కొనుక్కోవాలో, అలా కొనుక్కోకపోతే ఎలా బ్రతకలేమో జ్ఞాన బోధచేసి ఎట్టకేలకు అంగీకరింపజేశాడు. వసుధ తన మెడలో వున్న గొలుసును అమ్మి జాబ్‌ని కొనుక్కుంది.

వసుధ మొదటిజీతం తీసుకునే నాటికి జాన్‌కి మూడు నెలల జీతం ఒక్కసారి చేతికి వచ్చింది. జారిపోతున్న ఆత్మవిశ్వాసాన్ని కూడదీసుకుని ఉత్సాహంతో తమ ఉద్యోగ విధులను నిర్వహించసాగారు భార్యాభర్తలిద్దరూ. వసుధ కడుపులో ఊపిరి పోసుకుంటున్న పాపాయిని సంతోషంగా, గర్వంగా ఆహ్వానించారు.

"డెలివరీ గురించి నువ్వేం దిగులు పెట్టుకోకు. హాస్పిటల్లో వున్నంత కాలం నీకేలోటూ లేకుండా, ఏ కష్టం లేకుండా చూసుకునే భారం నాది''- డెలివరీ గురించి భయపడుతున్న వసుధను ఊరడించింది శ్రుతి, అనుక్షణం అమ్మను తలచుకుని కలత చెందుతున్న వసుధ, శ్రుతిని చూసి ధైర్యం తెచ్చుకుంది.

కబురు తెలిసి చూడడానికి వచ్చిన వసుధ ఫ్రెండ్ మాలతి తల్లీబిడ్డల్ని తనతో తీసుకువెళ్ళి రెండు నెలలుంచుకుని పంపింది. ఇంటి దగ్గర బిడ్డను చూసుకోవడానికి మనిషిని ఏర్పాటు చేసుకుని డ్యూటీలో చేరడానికి వెళ్ళిన వసుధ తన స్థానంలో మరొకర్ని అప్పాయింట్ చేసి తనకు మొండిచెయ్యి చూపించడంతో నిశ్చేష్ట అయింది. విపరీతమైన ఆవేశంతో దెబ్బలాడింది. తను చెల్లించిన డబ్బు మాటేమిటని క్రోధంగా నిలదీసింది. చివరకు తన ఆవేశం, కోపం, కేకలు నిష్ప్రయోజనమని తేలిపోయాక పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది.

పులిమీద పుట్రలా అప్పుడే రెండు నెలల నుంచి జాన్‌కి జీతం రావడంలేదు. కూడబెట్టిన డబ్బంతా వసుధ డెలివరీ టైములో అయిపోయింది. క్రమేపి అవసరం అప్పులుచెయ్యడం కూడా నేర్పింది. దొరికిన చోటల్లా అప్పులు చేశారు. ఇప్పుడదీ పుట్టని పరిస్థితి వచ్చింది.

వసుధ కళ్ళు తుడుచుకుంది. మనసంతా తిక్కతిక్కగా వుంది. గోడకు వ్రేలాడు తున్న డిగ్రీల్ని చూస్తే కసిగా ఉంది. హైస్కూలు చదువుకూడా దాటకుండా పై సంపాదన పుష్కలంగా ఉండే చిరుద్యోగం చేస్తున్న ప్రక్కవాటా ఆంజనేయులి భార్య సుందరి చేస్తున్న పేరంటపు కోలాహలం విపరీతమైన ఆవేశాన్ని రగిలిస్తూంది.

"వసూ! బాబలా గుక్కపట్టేడుస్తున్నాడు, కడుపు నొప్పిగా వుందేమో! డాక్టర్‌గారికి చూపించి రారాదూ?" జాన్ మాటలు విని వసుధ మౌనంగా బాబుని భుజానేసుకుంది.

"బాబుకు పాలు పట్టి ఎంత సేపయిందమ్మా?" బాబుని పరీక్షచేసి వసుధని అడిగింది శ్రుతి.

"ఇంతకు ముందే-" వినీ వినపడనట్లుగా జవాబిచ్చింది వసుధ.

"బహుశా ఆకలి తీరుండదు. పాలు పట్టు మళ్ళీ. అప్పటికీ ఏడుపు మానకపోతే ఈ మందుపట్టు" వసుధ కృంగిపోతూంది. ఆమెకు తెలుసు బాబుకు ఆకలి నొప్పే కాని, కడుపు నొప్పి కాదని.

"నువ్వేమిటలా వున్నావు వసుధా?" వసుధ భుజంమీద చెయ్యేసి మృదువుగా అడిగింది శ్రుతి. మేఘాలు చిట్లాయి. వర్షంలో తడిసి ఒణుకుతున్న పూలరేకుల్లా వున్నాయి వసుధ కనురెప్పలు.

"సారీ! కదిలించి నిన్ను బాధపెట్టానేమో!" అంది శ్రుతి.

"అబ్బే! బాధేంలేదు మేడమ్! అలవాటయిపోయింది. బాధలకు చలించే సౌకుమార్యం కూడా హరించిపోతూంది. వెయ్యేళ్ళు తపస్సు చేసినా పొందలేని మనోనిబ్బరాన్ని నేర్పుతోందీ నిరుద్యోగ పర్వం. సాధన పూర్తికాక అప్పుడప్పుడీ తడబాటు." కన్నీళ్ళతో నవ్వింది వసుధ. కోల్పోతున్న ఆత్మస్థైర్యాన్ని బలవంతాన కూడదీసుకుని శ్రుతి దగ్గర సెలవు తీసుకుంది.

మేఘాలు ముసురుకోవడం వల్ల బయట చిమ్మచీకటిగా వుంది. ఒక క్షణం భయమేసినా, నడుస్తూ ఉంటే అంతలోనే మబ్బుల్ని చీల్చుకుని వెన్నెల రేకలు వికసిస్తా యేమోనని ఆశపడుతూ అడుగు ముందుకు కదిపింది వసుధ.